సాక్షి
విశాఖపట్నం

శనివారం । 3 । ఆగస్టు । 2024



తైక్వాండో పోటీలు ప్రారంభం

జాతీయ 7వ క్యాడెట్ కోరుగి పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్‌ను కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రారంభించారు. II లో



గాంధీధాం-పూరీ ఎక్స్‌ప్రెస్ రద్దు

14న గాంధీధాం-పూరీ(22973) ఎక్స్‌ప్రెస్, 17న పూరీ-గాంధీధాం(22974) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. II లో

రేషన్ బియ్యం పట్టివేత

పలు ప్రాంతాల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. II లో





ఈ ఫొటోలో కనిపిస్తోంది భీమిలి మండలం టీ.నగరంపాలెంలో గ్రామ సచివాలయం. కొత్తగా నిర్మించిన భవనమిది. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి రూ.15 లక్షలు, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి రూ.25 లక్షలు. మొత్తంగా ఈ భవనాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు రూ.**40** లక్షలు ఖర్చు అయ్యింది.



ఇదిగో.. ఈ ఫొటోలో కనిపిస్తోంది భీమిలిలో నిర్మాణం పూర్తయిన అన్నా క్యాంటీన్. దీనికి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల విరిగిన టైల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, టాయిలెట్స్ మరమ్మతులు, రంగులు వేయడం.. ఈ పనులకే అక్షరాలా రూ.**16.50** లక్షలు ఖర్చు చేస్తున్నారు. సచివాలయంలో ఒక ఫ్లోర్‌ను అన్ని హంగులతో నిర్మించేందుకు రూ.**15** లక్షలు ఖర్చయితే.. అన్నాక్యాంటీన్లలో చిన్న చిన్న మరమ్మతులకే అంతకు మించి ఖర్చు చేస్తున్నారు.



ఇది పద్మనాభంలోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌తో నిర్మించిన గ్రామ సచివాలయం. భారీగా కనిపిస్తున్న ఈ భవనం నిర్మించేందుకు కేవలం రూ.**25** లక్షలు మాత్రమే ఖర్చు చేశారు.



మరి ఈ అన్నా క్యాంటీన్ చూశారా.? **అనకాపల్లిలో గతంలో** నిర్మించిన అన్నా **క్యాంటీన్ ఇది. దీనికి** రంగులద్దుతూ చిన్న **చిన్న మరమ్మతులు** చేసేందుకు **రూ.19 లక్షలు ఖర్చు** చేస్తున్నారంట.

అన్నన్నా.. ఇంత ఖర్చా!



జనతాబజార్ అన్నా క్యాంటీన్‌కు రూ.18 లక్షలు

ఇది 35వ వార్డులోని జనతా**బజార్‌లో ఉన్న** అన్నా క్యాంటీన్. దీని మరమ్మ**తులకు** కేటాయించిన మొత్తం వింటే **దిమ్మతిరిగి** మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. ర**ంగులు, టైల్స్** వేసేందుకు ఏకంగా రూ.18 **లక్షలు** ఖర్చవుతుందంట.



శివనగర్ క్యాంటీన్‌కు రూ.15.56 లక్షలు

ఈ క్యాంటీన్ 53వ వార్డులోని శివనగర్‌లో ఉంది. కేవలం రంగులేసి బిల్డింగ్ లోపల కొంచెం టచప్ ఇస్తే చాలు. కానీ ఇక్కడేదో మరో అంతస్తు కడుతున్నట్లుగా ఏకంగా రూ.15.56 లక్షలతో పనులు చేస్తున్నారంటే విడ్డూరంగా ఉంది మరి.

- **రూ. 3.5 కోట్లతో 25 అన్నా క్యాంటీన్లకు మరమ్మతులు**
- **ఒక్కో క్యాంటీన్‌కు రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షల మేర వ్యయం**
- **అంచనాల్లో ఇంజినీరింగ్ అధికారుల చేతివాటం**
- **మరమ్మతు పనుల్లో టీడీపీ కాంట్రాక్టర్లు**
- **పత్తాలేని సూపర్ సిక్స్..**
- **అన్నా క్యాంటీన్లకు మాత్రం నిధులు మంజూరు**

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉన్న క్యాంటీన్లకు కొత్త రంగులద్దే కార్యక్రమంలో రూ.కోట్లు కొల్లగొట్టేందుకు టీడీపీ నేతలు స్కెచ్ వేశారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ఉన్న అన్నా క్యాంటీన్లను ఆగస్ట్ 15లోగా సిద్ధం చేయాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. అనుకున్నదే తడవుగా.. జీవీఎంసీ అధికారులు పనులు నిర్వహించేందుకు అంచనాలు సిద్ధం చెయ్యడం..కాంట్రాక్టరకు అదీ కూటమి ప్రభుత్వానికి చెందిన కాంట్రాక్టర్లకు మాత్రమే పనులు అప్పగించేలా వ్యవహారం చకచకా నడిచిపోయింది. ఇంకేం ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా.. వేసిందే అంచనా.. చేసిందే పని.. రీతిలో అన్నాక్యాంటీన్ల మరమ్మతులలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి.

అంచనాల్లోనే అవినీతి...!

వాస్తవానికి ఈ అవినీతి వ్యవహారం మొదలైందంతా అంచనాలు సిద్ధం చేసే ప్రక్రియ నుంచే. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు క్యాంటీన్ మరమ్మతులకు సంబంధించిన అంచనాల్లోనే అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే చాలు.. ఉన్న భవనం మళ్లీ వినియోగించుకోవచ్చని తెలిసినా.. తమ ఖాతాలు, అధికార పార్టీ నేతల జేబులు నిండేలే అంచనాలు సిద్ధం చేశారు. ఒక భవనం నిర్మిస్తే.. ఎంత వ్యయం అవుతుందో.. దానికి సమానంగా మరమ్మతు పనులకు వ్యయ ప్రణాళికలు తయారు చేయడం విడ్డూరం. మొత్తం 25 క్యాంటీన్ల మరమ్మతులకు ఏకంగా రూ.3.50 కోట్లు ఖర్చవుతుందని లెక్క కట్టారు. క్యాంటీన్ పనుల అంచనాలు చూస్తే.. మరో రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలు వెచ్చిస్తే ఏకంగా కొత్త వాటి నిర్మాణం చేపట్టవచ్చునన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి కాంట్రాక్టర్లకే...!

సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేమంటూ స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ఏకరవు పెట్టారు. కానీ అన్నాక్యాంటీన్లు మాత్రం ప్రారంభించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కారణం ఈ క్యాంటీన్ల మాటున.. కూటమి నేతలకు లబ్ధి చేకూర్చేందుకేనన్నది స్పష్టమవుతోంది. అందుకే వీటి మరమ్మతులకు సంబంధించి షార్ట్‌టర్మ్ టెండర్లతోనే పనులు అప్పగించేశారు. ప్రతి క్యాంటీన్‌కు సంబంధించిన పనిని తాము సిఫారసు చేసిన వారికే ఇవ్వాలని ఇప్పటికే టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను కూడా మార్చేసి అందర్నీ జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఏమార్చేశారు. ఒక భవనం నిర్మించేందుకు అయ్యే ఖర్చుతో స్వల్ప మరమ్మతు పనులు నిర్వహించి రూ.కోట్లలో ఖజానాకు కన్నం పెట్టేందుకు కూటమి నేతలు హడావుడి పడుతున్నారు.



తగరపువలస అన్నాక్యాంటీన్‌కు రూ.16.50 లక్షలు

ఇది తగరపువలసలో ఉన్న అన్నక్యాంటీన్. **భవనమంతా భేషుగ్గా** ఉంది. రంగులేసి కాస్తా **మెరుగులద్దితే చాలు. ఈ** పనులకు అక్షరాలా రూ.16.50 లక్షలు కేటాయించారు.

ఇలా ప్రతి క్యాంటీన్‌లోనూ కూటమి నేతల అక్రమాలు.. అడ్డగోలు అమ్యామ్యాలే తప్ప.. నిజంగా పనులు చేసేందుకు కాదన్నది స్పష్టమవుతోంది.

అందరివాడు బొత్స



ఆయన పేరు బొత్స సత్యనారాయణ.. కానీ అందరూ ఆయనను అభిమానంగా సత్తిబాబు అని పిలుచుకుంటారు. విభిన్నమైన నాయకుడు బొత్స. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించారు. అన్నిటి కంటే అందరివాడుగా పేరు పొందడమే ఆయనకు పెద్ద అలంకారం. సామాన్యులు వెళ్లి తమ కష్టం చెప్పినా ఆయన వెంటనే స్పందించి వారి సమస్య పరిష్కరిస్తారని ప్రతిపక్షంలోని వారు సైతం చెప్పుకునే మాట. అలాంటి నాయకుడిని ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లా నాయకుల సమావేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకున్న పార్టీ అధినేత బొత్సను అభ్యర్థిగా ప్రకటించారు.

- విద్యార్థి నాయకుడి నుంచి మంత్రిగా ఎదిగిన నాయకుడు
- వైఎస్సార్, జగన్ క్యాబినెట్లలో మంత్రిగా తనదైన ముద్ర

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ సీనియర్ రాజకీయ నాయకుడు. బలమైన ప్రజా మద్దతుతో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఎలాంటి వివాదాన్నయినా సామరస్యంగా పరిష్కరించగల నేతగా పేరు. విశాఖ అభివృద్ధి కోసం.. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న యూనియన్ సంఘాలకు తన మద్దతు పలికారు. అంతేకాకుండా తన సతీమణి ఎంపీగా ఉన్న సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ గురించి ఆనాడు పార్లమెంట్‌లో గళం వినిపించేలా చేశారు. గాజువాక అల్లుడిగా ఈ ప్రాంతంతో మరింత అనుబంధం బొత్స సత్యనారాయణకు ఉంది.

విద్యార్థి నాయకుడి నుంచి మంత్రిగా..

విజయనగరంలో బొత్స గురునాయుడు, ఈశ్వరమ్మ దంపతులకు 1958లో బొత్స సత్యనారాయణ జన్మించారు. ఆయన మహారాజా కళాశాలలో బీఏ డిగ్రీ పూర్తి చేశారు. ఆయన 1985లో బొత్స ఝాన్సీలక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అబ్బాయి సందీప్, అమ్మాయి అనూష. రాజకీయ జీవితం విద్యార్థి దశ నుంచే ప్రారంభమైంది. 1978లో విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చి అంచలంచెలుగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ లీడర్‌గా ఎదిగారు. ఆయన 1992 నుంచి 99 వరకు రెండుసార్లు విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. 1999లో బొబ్బిలి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఆనాడు ఎన్డీయే హవా వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి కేవలం ఐదుగురు ఎంపీలే గెలవగా అందులో బొత్స ఒకరు. 2004, 2009లలో చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రధాన అనుచరుడిగా ఆయనకు పేరుంది. ఆయన వైఎస్సార్, రోశయ్య , కిరణ్ కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతర పరిణామాలతో 2014లో ఓడిపోయారు. దీంతో 2015లో కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన బొత్స సత్యనారాయణ తన మద్దతుదారులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. 2019 చీపురుపల్లి నియోజకవర్గం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్‌లో పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా కూడా ఆయన పనిచేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించకుంటే చర్యలు

- సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు

ఆరిలోవ: సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు శుక్రవారం శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని విద్యార్థుల వసతి, తరగతి గదులు, భోజన శాల, గ్రంథాలయం, ఆర్ట్ గ్యాలరీని పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించి.. అందుబాటులో ఉన్న పుస్తకాల గురించి ఆరా తీశారు. గురుకులంలో నెలకొన్న సమస్యలు, అవసరమైన సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్ రత్నవల్లిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బంది సమావేశయ్యారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కన్నబాబు

గురుకులాల్లో 100 శాతం ఫలితాలు సాధించే విధంగా అధ్యాపకులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. విద్యా బోధన, ఫలితాలు సాధించడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు, విద్యా సామగ్రిని విద్యార్థులకు అందించాలన్నారు.


న్యూస్‌రీల్

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



విశాఖ విద్య: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందేందుకు ఆసక్తి, అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక ఉంటుందన్నారు. అర్హులైన వారు ఈ నెల 5 లోపు దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

'సావిత్రి క్లాసిక్స్' పుస్తకావిష్కరణ



సావిత్రి క్లాసిక్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట : ప్రముఖ సినీ చరిత్రకారుడు సంజయ్ కిషోర్(హైదరాబాద్) రచించిన సావిత్రి క్లాసిక్స్ పుస్తక పరిచయ సభ శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుస్తక రచయిత సంజయ్‌కిషోర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ సావిత్రి క్లాసిక్స్ పుస్తకం బ్లాక్ అండ్ వైట్‌చిత్రాల రోజులను ఎందుకు స్వర్ణయుగం అంటామో ఈ పుస్తకం చదివితే అర్థం అవుతుందన్నారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఆమె అభిమానులకు ఈ పుస్తకం ఒక పండుగే అని అభివర్ణించారు. ఫిల్మ్ సొసైటీ సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, రంగసాయి నాటక సంఘం అధ్యక్షుడు బాదంగీర్ సాయి, ఎండీ హుస్సేన్, చాట్ల బాబూరావు పాల్గొన్నారు.

100 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

దాబాగార్డెన్స్ : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం భారీ జెండా (100 అడుగులు)ను ప్రదర్శించింది. సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ఆంధ్ర తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ పలువురు ప్రముఖులు ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ నుంచి రాణిబొమ్మ వరకు భారీ జెండా ప్రదర్శించారు.

ఈ సందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్‌అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింగళి వెంకయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని, వెంకయ్య విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వంద రోజుల ప్రణాళికతో గృహ నిర్మాణాలు

జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని, వంద రోజుల ప్రణాళికను అనుసరించి 71,133 ఇళ్లకు సంబంధించి స్టేజ్ అప్డేషన్ జరగాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, వాటి పురోగతిపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి.అఖిల, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల తాజా పరిస్థితిని ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో లేఅవుట్లలో పరిస్థితిని, ఇళ్ల నిర్మాణాల పురోగతిని వివరిస్తూ గృహ నిర్మాణ సంస్థ పీడీ ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్రామీణ పరిధిలోని 138 లేఅవుట్లు, అర్బన్ పరిధిలో 64 లేఅవుట్లు ఉన్నాయని, 1.39 లక్షల ఇళ్లు కేటాయించగా 1.29 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. వాటిలో అన్ని దశల పనులు పూర్తి చేసుకున్నవి 23,995 ఇళ్లు ఉన్నాయని, మిగిలినవి ఇతర దశల్లో ఉన్నాయని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో పలు శాఖల అధికారులు

ఆగస్టు 10వ తేదీ నుంచి రోజువారీ పురోగతిపై నివేదికలు సమర్పించాలని, అంతర్గత సమీక్షలు చేసుకోవాలని సూచించారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ నిర్వహణకు లబ్ధిదారులు తప్పకుండా రావాలని, అధికారులకు, సిబ్బందికి సహకరించాలని హితవు పలికారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్యప్రకాశరావు, ఇతర ఏఈలు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తమ్ముడి మోసం

- ఆస్తిని కాజేసేందుకు ప్రభుత్వ విభాగాలతో కుమ్మక్కు
- జీవీఎంసీ, తహసీల్దార్, ఈపీడీసీఎల్ నుంచి ఫేక్ డాక్యుమెంట్ల సృష్టి
- నలుగుర్ని అరెస్ట్ చేసిన ఫోర్త్‌టౌన్ పోలీసులు

సీతమ్మధార: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. తమకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. చట్టాలను ధిక్కరించి.. ఆస్తిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నించారు. చివరికి కటకటాల పాలయ్యారు. ఈ కేసులో నలుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. లలితానగర్‌కు చెందిన కొల్లి కృష్ణవేణి, కృష్ణారెడ్డి దంపతులకు డోర్ నంబర్ 49-3-7/2 లో రెండు అంతస్తుల భవనం ఉంది. రైల్వేలో పని చేసి రిటారైన కృష్ణారెడ్డి 2003లో మృతి చెందారు. వీరికి పిల్లలు లేరు. దీంతో కృష్ణవేణి బాధ్యతలన్నీ ఆమె తమ్ముడు వాసు చూసుకునేవారు. కృష్ణారెడ్డి తమ్ముడు తమ్మారెడ్డి పెద్ద కుమార్తె దుర్గాసి రాజరాజేశ్వరిని పెంచుకుందామని కృష్ణవేణి భావించారు. అయితే రాజరాజేశ్వరితో ఆమె సఖ్యతగా ఉండకపోవడం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. దీంతో మంచిచెడ్డా అంతా ఆమె సోదరుడు వాసు, మరదలు రాజ్యలక్ష్మి చూసుకునేవారు. కృష్ణవేణి తన పేరిట ఉన్న ఆస్తిలో ఓ భాగాన్ని రాజరాజేశ్వరికి ఇచ్చేందుకు నిర్ణయించుకున్నారు. పై అంతస్తును రాజేశ్వరి పేరిట, దిగువ పోర్షన్‌ను తమ బాగోగులు చూసిన వాసుకు ఇచ్చేందుకు పత్రాలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో కృష్ణవేణి క్యాన్సర్‌తో మృతిచెందారు. దీంతో ఆమె ఆస్తి మొత్తాన్ని కాజేసేందుకు తమ్మారెడ్డి కుటుంబం స్కెచ్ వేసింది. తప్పుడు పత్రాలు సృష్టించింది. దీంతో మానసికంగా కుంగిపోయిన వాసు గతేడాది నవంబర్ 26న మృతి చెందారు. ఇక అడిగేవారు ఎవరూ లేరని భావించిన తమ్మారెడ్డి కుటుంబ సభ్యులు 2023 జూన్ 25న కృష్ణవేణి రెండంతస్తుల భవనం తాళాలు పగలకొట్టి స్వాధీనం చేసుకున్నారు. తమ్మారెడ్డి కుటుంబ సభ్యులు, జీవీఎంసీ సిబ్బందితో కుమ్మక్కై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు.

రిజిస్టర్డ్ వీలునామా ఉన్నా..

తమ్మారెడ్డి కుటుంబ సభ్యులు పోలీసులను బురిడీ కొట్టించారు. కృష్ణవేణి ఇంటిని పూర్తిగా ఆక్రమించుకోవాలన్న దురాశతో లలితానగర్‌లోని ఆమె మరిది తమ్మారెడ్డి, అతని పెద్ద కుమార్తె రాజరాజేశ్వరి, చిన్న కుమార్తె కొవ్వూరి హిమప్రియ, చిన్న అల్లుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి పక్కా స్కెచ్ వేశారు. విద్యుత్ బిల్లును తమకు నచ్చినట్లుగా మార్పించుకున్నారు. ఈ పరిస్థితుల్లో వాసు భార్య రాజ్యలక్ష్మి తన వద్ద ఉన్న ఆధారాలన్నీ పట్టుకుని పోలీసు, రెవెన్యూ అధికార యంత్రాంగం చుట్టూ కాళ్లరిగేలా తిరిగింది. ఎవరికి వారు తమది కాదంటే తమది కాదని చెప్పడంతో విసిగిపోయింది. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని జూలై 23న ఆమె కలిసి.. ఆస్తి విషయంలో తమ్మారెడ్డి కటుంబం చేస్తున్న వేధింపుల వల్లే తన భర్త మృతి చెందాడని ఫిర్యాదు చేసింది. జీవీఎంసీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మజతో కుమ్మక్కైనట్లు సమాచార హక్కు చట్టం ద్వారా సంపాదించిన పత్రాలతో సహా రుజువు చేసింది. ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ ఎఫ్ఎంసీ నంబర్ 230328066987 కూడా మార్పు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీన్ని పరిశీలించిన సీపీ తమ్మారెడ్డి ఫ్యామిలీ మెంబర్‌గా కొల్లి కృష్ణారెడ్డిని చేర్చి ఫ్యాబ్రికేటెడ్ డాక్యుమెంట్‌ను సృష్టించినట్లు గుర్తించారు. ఆ డాక్యుమెంట్‌లో కొల్లి కృష్ణారెడ్డి డెత్ డేట్‌ను కూడా మార్పు చేయడాన్ని పరిశీలించారు. ఇళ్లు కాజేయాలన్న దురుద్దేశంతో ఇవన్నీ చేయడంతో పోలీసులు మారోసారి రంగంలోకి దిగి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేశారు. నిజనిర్ధారణ కోసం జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్ సంస్థలకు లేఖ రాశారు. నిందితులపై ఐపీసీ సెక్షన్లను మార్పు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కృష్ణవేణి ఆస్తిని అక్రమంగా కాజేయాలని చూసిన తమ్మారెడ్డి, అతని కుమార్తెలు రాజరాజేశ్వరి, హిమప్రియ, చిన్న అల్లుడు లక్ష్మణరెడ్డిని శుక్రవారం సీఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

చంద్రబాబు ఎన్నికల హామీలపై పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

దాబాగార్డెన్స్: చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలపై పోరాటాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాల్సిందేనన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. విశాఖలో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సర్వసభ్య సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. 4న మదనపల్లెలో సీపీఐ రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. సీపీఐ శతాబ్ది వేడుకలు డిసెంబర్ 26 ప్రారంభమై ఏడాది పాటు జరుగుతాయన్నారు. ఇండియా కూటమి బీజేపీకి గట్టిపోటీ ఇచ్చిందన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీజేపీ వ్యతిరేకులపై ఈడీ, ఐటీ, సీబీఐలను ప్రయోగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడాన్ని సీపీఐ ఖండిస్తోందన్నారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఏజే స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎ.విమల, ఎం.మన్మథరావు, జి.రాంబాబు, కె.సత్యాంజనేయ, ఆర్ శ్రీనివాసరావు, ఎస్‌కే రహ్మాన్, పి.చంద్రశేఖర్, జీఎస్‌జే అచ్యుతరావు, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

పెట్రోల్ వాసనతో నీరు తాగేదెలా?

- ట్యాంకుల లీకుతో ఇళ్ల బోర్ల నీరు కలుషితం
- బంకు నిర్వాహకులు, అధికారులను నిలదీసిన మహిళలు



భారత్ పెట్రోల్ బంక్ వద్ద అధికారులను ప్రశ్నిస్తున్న స్థానికులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని సంఘం ఆఫీస్ కూడలి వద్ద ఉన్న భారత్ పెట్రోల్ బంకు వల్ల చుట్టుపక్కల ఇళ్లల్లో బోరు బావులు కలుషితమై.. పెట్రోల్ వాసనతో నీరు వస్తోందని స్థానికులు ఆరోపించారు. భూగర్భంలోని పెట్రోల్ ట్యాంకులు లీకవ్వడం వల్లే తమ ఇళ్లలో బోర్ల నుంచి పెట్రోల్ వాసనతో నీరు వస్తోందని మహిళలు బంకు నిర్వాహకులను నిలదీశారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం పౌరసరఫరాల అధికారులు పరిశీలనకు వచ్చారు. అయితే బంకులో పెట్రోల్ నిల్వలను పరిశీలించి.. ఎక్కడా లీకు లేదని నిర్ధారించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లీకు అవ్వకపోతే పెట్రోల్ వాసనతో నీరు ఎందుకు వస్తోందని అధికారులను ప్రశ్నించారు. నీటిని పరిశీలించాలని డిమాండ్ చేయగా.. వారు పలు ఇళ్లల్లో పరిశీలించి పెట్రోల్ వాసనతో నీరు వస్తోందని నిర్ధారించారు. దీనిపై జేసీకి నివేదిక ఇస్తామని.. ఆయన తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పి వెళ్లిపోయారు. బంక్ నిర్వాహకులతో అధికారులు కుమ్మక్కై.. పెట్రోల్ లీకు కావడం లేదని తప్పుడు రిపోర్టు ఇస్తున్నారని మహిళలు ఆరోపించారు. ఇళ్లల్లో వస్తున్న నీటిని ల్యాబ్‌లో పరీక్షించగా.. పెట్రోల్ కలిసినట్లు నివేదిక ఇచ్చారని వివరించారు. ఇప్పుడు అధికారులు పెట్రోల్ లీకు కావడం లేదని చెప్పడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని వారంతా విజ్ఞప్తి చేశారు.

త్వరలో శుభవార్త వస్తుందని ఆశిస్తున్నా..

- హోంగార్డులతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగరంలోని హోంగార్డులకు త్వరలో శుభవార్త వస్తుందని ఆశిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం కమిషనరేట్ పరిధిలోని 1039 మంది హోంగార్డుల సమస్యలు, ఇతర వినతులను సీపీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్నారా? లేదా? అన్న విషయంపై ఆరా తీశారు. సిబ్బంది కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సమస్యలు, వినతులు తెలపాలని సూచించారు. దీనిపై హోంగార్డులు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు, ఆరోగ్య భద్రత వర్తింపు, నెలకు 2 నుంచి 4 వరకు సెలవుల పెంపు, ఉద్యోగ నోటిఫికేషన్‌లో 25 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ కల్పన, పిల్లలకు ఫీజు రాయితీ, స్పోర్ట్స్ మీట్‌కు వెళ్లే వారికి వేతనంతో కూడిన స్పేరింగ్, ఇతర జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ వంటి పలు వినతులను సీపీకి విన్నవించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీపీ ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కొన్ని సందర్భాల్లో మహిళా ముద్దాయిలకు ఎస్కార్ట్‌గా మహిళా హోంగార్డుతో పాటు మహిళా కానిస్టేబుల్‌ను కూడా పంపాలని, సర్వీస్ మెడల్స్, సీనియర్ ర్యాంకింగ్స్, రెండేళ్లకు ఒకసారి డ్యూటీల మార్పు, నివాసానికి దగ్గరగా పోస్టింగ్ తదితర అంశాలను సీపీ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై పరిష్కారంపై సీపీ అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. హోంగార్డుల విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి రివార్డులు అందిస్తామన్నారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో పాటు ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక స్థిరత్వం పొందేలా హోంగార్డ్ పోస్ట్ రిటైర్‌మెంట్ కమిటీ ఏర్పాటుపై సీపీకి ధన్యవాదాలు తెలిపారు.

14న గాంధీధాం-పూరీ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు, మరికొన్ని రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. 14న గాంధీధాం-పూరీ(22973) ఎక్స్‌ప్రెస్, 17న పూరీ-గాంధీధాం(22974) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

- ఈ నెల 1, 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29వ తేదీల్లో అలప్పుజ-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ వయా పొదనూర్, ఇరుగూర్, సూరత్‌కల్ మీదుగా, ఎర్నాకుళం-టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్ వయా పొదనూర్, కోయంబత్తూర్, ఇరుగూర్ మీదుగా నడుస్తాయి.
- 6, 10, 11, 13, 14, 15, 18వ తేదీల్లో విశాఖపట్నం-నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది.
- 8, 12, 13, 15, 16, 17, 20వ తేదీల్లో నిజాముద్దీన్-విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, బల్హార్షా, విజయవాడ మీదుగా నడుస్తుంది.
- 18న విశాఖపట్నం-ఎల్టీటీ(22847) ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది.
- 20న ఎల్టీటీ-విశాఖపట్నం(22848) ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, బల్హార్షా, విజయవాడ మీదుగా నడుస్తుంది.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- జాతీయ తైక్వాండో పోటీలు ప్రారంభం
- హాజరైన 671 మంది క్రీడాకారులు



తలపడుతున్న క్రీడాకారులు



పోటీలకు హాజరైన పలు రాష్ట్రాల తైక్వాండో క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ 7వ క్యాడెట్ కొరుగి పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభయ్యాయి. పోర్ట్ ట్రస్ట్ డైమండ్ జూబ్లీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం తైక్వాండో క్రీడాకారుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ వేదికగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం చక్కటి పరిణామమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, ప్రతిభా పాటవాలతో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. తొలుత ఏపీ తైక్వాండో అధ్యక్షుడు హర్షవర్ధన్ అతిథులను ఆహ్వానించగా.. ఫీమేల్ క్యాడెట్ పోటీలను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మేల్ క్యాడెట్ పోటీలను విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర సర్వీసెస్ నుంచి 671 మంది క్రీడాకారులు పోటీపడుతున్నట్లు హర్షవర్ధన్ తెలిపారు. 45 మంది రిఫరీలు, దేశ నలుమూలల నుంచి 20 మంది అంతర్జాతీయ, మరికొంత మంది గ్రేడ్ క్వాలిఫైడ్ రిఫరీలతో పూర్తి పారదర్శకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా వినియోగించే అన్ని వసతులు, నియమ నిబంధనలతో పోటీలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో తైక్వాండో సమాఖ్య కోశాధికారి జస్బీర్‌సింగ్, టోర్నీ పరిశీలకుడు దొరై, వీఎంఆర్డీఏ ప్లానింగ్ అధికారి కె.వెంకటేశ్వరరావు, సంఘం ప్రతినిధులు డి.వి.చారి, లక్ష్మీనారాయణ, గణేష్, మురళీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు వీరే..

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆరు కోర్టుల్లో మ్యాట్స్‌పై బౌట్స్ జరుగుతున్నాయి. పోటీల్లో సర్వీసెస్‌తో పాటు చండీగఢ్, బిహార్‌కు చెందిన క్రీడాకారులు తొలిరోజు పోటీల్లో స్వర్ణాలందుకున్నారు. తొలిరోజు క్యాడెట్ మేల్ 180+లో ఆర్మన్‌సింగ్(ఎస్ఎస్‌సీబీ) విజేతగా నిలిచి స్వర్ణం అందుకోగా ఉత్కర్ష్(ఢిల్లీ) రజతం, శుభమ్‌ధార్(రాజస్థాన్), అభినవ్ వర్మ(మధ్యప్రదేశ్) కాంస్యాలను అందుకున్నారు. క్యాడెట్ మేల్-160లో తార్ నికమ్(అరుణాచల్‌ప్రదేశ్) విజేతగా నిలిచి స్వర్ణం అందుకోగా రమిత్(కర్ణాటక) రజతం, రోహిత్ సజని(బిహార్), నహక్పమ్(ఎస్ఎస్‌సీబీ) కాంస్యాలందుకున్నారు. క్యాడెట్ మేల్-172లో హిమాంశుకుమార్(బిహార్) విజేతగా నిలవగా ఆదిత్య శ్రీవాస్తవ(మిజోరం) రజతం, పునీత్(ఎస్ఎస్‌సీబీ), వంశ్ సుధీర్(ఉత్తరప్రదేశ్) కాంస్యాలందుకున్నారు.

ఆ గంటే ముఖ్యం.. నిలుస్తుంది ప్రాణం

- కలెక్టర్ హరేందిర ప్రసాద్



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వ్యక్తికి రివార్డు అందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంగం-శరత్ కూడలిలో ఇటీవల స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటోకు ప్రమాదం జరిగినప్పుడు గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వై.రాజు, రావి వెంకటరావులకు రూ.5 వేలు చొప్పున క్యాష్ రివార్డ్ అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో గ్రిల్స్, ఇతర పనులను ఒక నెలలో పూర్తి చేయాలన్నారు. హైవేలో సైన్ బోర్డులు, ఎన్‌హెచ్ పరిమితులు, తదితర పనులను ఈ నెలలో పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోతే డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తామన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జాయింట్ సీపీ ఫకీరప్ప, ఉప రవాణా కమిషనర్ రాజారత్నం, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, జీవీఎంసీ ఎస్ఈ సత్యనారాయణరాజు, ఆర్ అండ్ బీ ఎస్ఈ కె.కాంతిమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా

మహారాణిపేట: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టి అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కోఆర్డినేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడికక్కడ చెక్ పోస్టులు పెట్టి తనిఖీలు నిర్వహించి, గంజాయిని సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. స్నిఫర్ డాగ్స్ ద్వారా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, లగేజీ లాకర్లు, పార్శిల్ ఆఫీసులు, అనుమానిత వాహనాలు, షాపుల్లో గంజాయిని, మాదకద్రవ్యాలను గుర్తిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలో ఫ్లెక్సీ వార్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు టీడీపీలో అంతర్గతంగా ఉన్న వర్గపోరు ఫ్లెక్సీల చించివేతలతో బయటపడింది. గురువారం రాత్రి నుంచి ఇరువర్గాలు అంబేడ్కర్ కూడలిలో ఒకరు వేసిన ఫ్లెక్సీని మరొకరు కట్ చేస్తుండడంతో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇటీవల ఎంపీ భరత్ పుట్టినరోజు సందర్భంగా వార్డుకు చెందిన గరే సదానంద్ ఫ్లెక్సీ వేసి అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేశారు. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీకి వెళ్లిన కొప్పల రమేష్ దంపతుల ఫొటోలను అందులో వేయలేదు. ఇది వార్డు అధ్యక్షుడు తమ్మిన సూరిబాబుకు ఆగ్రహం తెప్పించింది. తన వర్గానికి చెందిన వెంకటేష్ అనే యువకుడితో ఈ ఫ్లెక్సీని కట్ చేయించి వాళ్ల అనుచరులు ఉన్న ఫొటోలతో వేసిన ఫ్లెక్సీని అక్కడ ఉంచారు. దీంతో సదానంద్ కూడా తన అనుచరులతో సూరిబాబు వర్గం వేసిన ఫ్లెక్సీని పాక్షికంగా కట్ చేసి ఇంటి వద్ద ఉన్న పాత ఫ్లెక్సీని తీసుకువచ్చి వారికి సవాల్ విసిరారు. కారణాలేవైనా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కోరాడ రాజబాబు వర్గాలుగా వీరు పనిచేస్తున్నట్టు మిగిలిన టీడీపీ నాయకులు మాట్లాడుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఫ్లెక్సీ వార్ నడుస్తూ మార్చి మార్చి పోటీగా పెడుతున్నారు. వీటిని జీవీఎంసీ అధికారులు తొలగించాల్సి ఉండగా.. చోద్యం చూస్తుండటం గమనార్హం.

ఎన్ఎంఎంఎస్‌కు 9 మంది విద్యార్థుల ఎంపిక

తగరపువలస: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించి చిట్టివలస జడ్పీహైస్కూల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో జి.సిద్ధు, కె.చరణ్, రాజ్‌సాత్విక్, ఎల్.భాస్కర్, షేక్ అబ్దుల్లా, జీవన్‌తేజ్, కె.సతీష్, జి.వర్షిణి, నిఖిత ఉన్నారు. వీరికి నాలుగేళ్లపాటు రూ.12వేలు వంతున స్కాలరషిప్ లభించనుంది. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, స్కూల్ పోటీ పరీక్షల ఇన్‌చార్జి పక్కి నాగేశ్వరరావు అభినందించారు.

7న మహిళా కళాశాల అధ్యాపక పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్)లో ఖాళీగా ఉన్న పీజీ అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 7న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజులా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కామర్స్-2, కెమిస్ట్రీ-2, ఇంగ్లిష్-1, బోటనీ-1, గణితం-2, కంప్యూటర్ సైన్స్-2, మైక్రోబయాలజీ-2, ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 చొప్పున అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను visakhawomen @gmail. comకు మెయిల్ చేసి.. ఆ రోజు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు.

రుషికొండ బీచ్‌లో షూటింగ్ సందడి



లొకేషన్‌లో హీరో ప్రియదర్శి

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు, రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి హీరో ప్రియదర్శి, నటుడు, దర్శకుడు తనికెళ్ల భరణి, వెన్నెల కిశోర్‌పై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. మరో వారం రోజుల పాటు ఆర్.కె.బీచ్- భీమిలి బీచ్ ప్రాంతాల్లో ఈ చిత్రం షూటింగ్ ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.

రేషన్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న సీఎస్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు

మహారాణిపేట, అక్కిరెడ్డిపాలెం, గోపాలపట్నం: నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం నిల్వలపై పౌర సరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. రైల్వే న్యూకాలనీలో ఎస్ఎస్‌వీ క్యాటరింగ్‌లో 220 కిలోల బియ్యం, పాత పరదేశిపాలెం, మధురవాడ ఏరియాల్లో అనధికార గోదాముల్లో 750 కిలోల బియ్యం నిల్వలను గుర్తించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో సీఎస్‌డీటీ చైతన్య పర్యవేక్షణలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు కె.నరేష్, బి.సతీష్ కుమార్ దాడుల్లో పాల్గొన్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని ఈ సంస్థలపై 6ఎ కేసు నమోదు చేశారు.

నాతయ్యపాలెంలో 300 కిలోలు : నాతయ్యపాలెంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 300 కిలోల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌వో టి.కృష్ణ తెలిపారు.

పీడీఎస్ బియ్యం నిల్వలపై దాడులు : మూడు టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం కాకానినగర్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎయిర్‌పోర్టు పోలీసులు పట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలో 1 టౌన్ నుంచి సబ్బవరానికి 3 వ్యాన్లలో మూడు టన్నుల రేషన్ బియ్యం తరలిస్తుండగా పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు కాకానినగర్ వద్ద తనిఖీలు నిర్వహించారు. గోపాలపట్నంకు చెందిన చిలకపల్లి శ్రీను, చిలకపల్లిరాంబాబు, యలమంచిలి మంగరావులను అదుపులోకి తీసుకున్నారు. పౌర సరఫరాల ఆర్ఐ సతీష్, డిప్యూటీ తహసీల్దార్ చైతన్య ఆధ్వర్యంలో బియ్యాన్ని పౌరసరఫరాల గోదాముకు తరలించారు. సీఐ చక్రధరరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పద్మనాభం: విజయానందపురంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో గడ్డి నివారణ మందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ..ఈ గ్రామానికి చెందిన పాలెపు అప్పలరాజు(56) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. వీటికి తాళలేక ఈ నెల ఒకటో తేదీన గడ్డి నివారణకు ఉపయోగించే మందు తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఆయన విజయనగరం అరుణా జ్యూట్ మిల్లు సమీపంలోని కార్ల షోరూంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


‘ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం’



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షురాలు నాగమల్లీశ్వరి

సీతంపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఖండిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షురాలు మంచా నాగమల్లీశ్వరి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ తీర్పు ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగానికి లోబడి సుప్రీంకోర్టు తీర్పులిస్తుందా అని ప్రశ్నించారు. అసలు వర్గీకరణ కమిటీలో దళితులు ఉన్నారా అని అనుమానం వ్యక్తం చేశారు. అన్నదమ్ముల వలె కలిసి ఉన్న దళితులను వర్గీకరణ చేసి విడదీయడం ఆవేదనకు గురి చేస్తోందన్నారు. ఈ అంశంపై రిజర్వేషన్లు పొందిన నాయకులు, అధికారులు, వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారు మాట్లాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. కేవలం స్వప్రయోజనాలకోసం జాతిని తాకట్టు పెడతారా అని మండిపడ్డారు. ఈ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని, అవసరమైతే మహోద్యమం చేపట్టి ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేస్తామని మల్లీశ్వరి స్పష్టం చేశారు.

మహిమ గల కాయిన్ అంటూ బురిడీ



పూజలు చేసిన రాగి కాయిన్ ఇదే

గోపాలపట్నం: మహిమ గల కాయిన్ అంటూ మోసం చేసిన ఓ వ్యక్తిని బాధితులు నిర్బంధించి డబ్బులు డిమాండ్ చేయడం స్థానికంగా సంచలనం రేపింది. గోపాలపట్నం సీఐ సురేష్ తెలిపిన వివరాలివీ.. విజయవాడకు చెందిన అన్వేష్ ద్వారా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కొత్తగూడెం అశ్వారావుపేటకు చెందిన గుత్తల నారాయణరావుతో కొత్తపాలేనికి చెందిన అయితంశెట్టి తాతయ్యలు, అంజంతా పార్క్‌కు చెందిన అజయ్, గోపాలపట్నానికి చెందిన మనోజ్, పవన్‌లకు పరిచయం ఏర్పడింది. తన వద్ద రాజుల కాలం నాటి రాగి కాయిన్ ఉందని, దానికి అద్భుత శక్తులు వచ్చేలా చేస్తానని నారాయణరావు నమ్మబలికాడు. దీనికి కొంత ఖర్చు అవుతుందని నమ్మబలికి రూ.1.70 లక్షలు వసూలు చేశాడు. ఆ మేరకు ప్రహ్లాదపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గదిని అద్దెకు తీసుకుని రాగి కాయిన్ రసాయనాలు కలిపి శక్తులు తెప్పించేందుకు గత నెలలో పూజలు ప్రారంభించారు. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో నారాయణరావు వెళ్లిపోవడానికి ప్రయత్నించాడు. కాయిన్‌కు శక్తులు అయినా తెప్పించాలి లేదా రూ.1.70 లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చూస్తూ నారాయణరావును అజయ్, తాతయ్యబాబు, మనోజ్, పవన్ బంధించారు. మూడు రోజుల క్రితం నారాయణరావు అశ్వారావుపేటలో ఉన్న తన కుమారుడు సాయికుమార్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో సాయికుమార్ ఇక్కడికి వచ్చి గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ కాల్ సిగ్నల్ ఆధారంగా కిడ్నాప్ వ్యవహారాన్ని ఛేదించారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి మధ్య ఏవిధమైన ఒప్పందాలు జరిగాయి. ఎవరెవరి పాత్ర ఎంత ఉందన్న విషయాలపై పోలీసులు విచారిస్తున్నారు. మహిమ గల కాయిన్లు అంటూ ఏవీ లేవని, ఎవరు చెప్పినా మోసపోవద్దని సీఐ సురేష్ సూచించారు. పోగొట్టుకున్న డబ్బుల కోసం ఇలా కిడ్నాప్ చేయడం, బంధించడం నేరాలకు కిందకు వస్తుందని హెచ్చరించారు.